# నమస్తే తెలంగాణ

## మంచిర్యాల
## కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | మంగళవారం 16 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## బీఆర్ఎస్, బీజేపీ నాయకుల అరెస్ట్



భీమారం పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

భీమారం, జూలై 15: కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, విడుదల, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, గ్రూప్–2, 3 పోస్టుల పెంపు, డీఎస్సీ పరీక్షల వాయిదా, గ్రూప్ –1 మెయిన్‌కు 1: 100 పద్ధతిలో అభ్యర్థులను పిలవాలనే డిమాండ్లతో సోమవారం రాష్ట్ర సచివాలయం ముట్టడికి నిరుద్యోగులు పిలుపునిచ్చారు. ముట్టడికి వెళ్లనీయకుండా భీమారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు వేముల ప్రణీత్ గౌడ్, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి వీరగోని రమేశ్ గౌడ్, యువ నాయకుడు దాసరి మణిదీపక్, బీజేపీ నాయకులు కొమ్ము కుమార్‌యాదవ్, వేల్పుల రాజేశ్ యాదవ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.




ఈపీఎఫ్ జమ చేయడంలో కాంట్రాక్టర్ సంస్థ చేస్తున్న మోసాన్ని చెబుతున్న కార్మికులు

# కార్మికుల కష్టం దోచేశారు!

**ఈపీఎఫ్ జమ చేయడంలో కాంట్రాక్టర్ సంస్థ ఇష్టారాజ్యం**

- శ్రీరాంపూర్ ఓసీపీలో ఏడాదిన్నరగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యవహారం
- సింగరేణి అధికారులకు అంతా తెలిసే మిన్నకుండిపోయారంటున్న కార్మికులు
- గడిచిన 18 నెలల్లో రూ.57.60 లక్షల సొమ్ము స్వాహా

మంచిర్యాల, జూలై 15(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సింగరేణి సంస్థ కోసం కష్టపడి పనిచేసే కార్మికుల సంక్షేమానికి సంస్థ పెద్ద పీట వేస్తున్నది. దసరా, దీపావళి బోనస్‌లు, లాభాల్లో వాటాలు ఇలా చెప్పుకుంటూ పోతే కోల్ మైనింగ్‌లో దేశంలో ఏ సంస్థ కల్పించనన్ని సదుపాయాలను సింగరేణి సంస్థ కార్మికులకు ఇస్తున్నది. కాగా, సింగరేణిని కాంట్రాక్ట్ పనులు తీసుకున్న కొన్ని సంస్థలు లాభాపేక్షతో చేసే పనులు సంస్థను అభాసుపాలు చేస్తున్నాయి. శ్రీరాంపూర్ ఓసీపీలో మట్టి తవ్వకాలకు సంబంధించి డ్రిల్లింగ్, ఎక్సావేక్షన్, లోడింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, డంపింగ్, స్ప్రెడ్డింగ్, లెవలింగ్ మొదలైన ఓవర్ బర్డెన్ పనులు చేసేందుకు సింగరేణి సంస్థ ఓ ప్రైవేటు సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చింది. 48 నెలల కాలానికి ఈ పనులు చేసేందుకు సదరు సంస్థకు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటి వరకు 18 నెలలు(ఏడాదిన్నర) పూర్తయ్యింది. కాగా, ఈ కాంట్రాక్టర్ సంస్థ నియమించుకున్న కార్మికులకు ఈపీఎఫ్(ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్) జమ చేయడంలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఈపీఎఫ్ చట్టాన్ని అనుసరించి కార్మికులకు ఇచ్చే వేతనంలో 12 శాతం ఈపీఎఫ్ కట్ చేసుకుని, మరో 12 శాతం మ్యాచింగ్ గ్రాంట్‌ను సంస్థ ఈపీఎస్ అకౌంట్‌లో జమ చేయాలి. కానీ, ఈ కాంట్రాక్టర్ సంస్థ అలా చేయకుండా కార్మికులకు న్యాయంగా దక్కాల్సిన డబ్బులను మిగిల్చుకుంటున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా..

### ఒక్కో కార్మికుడిపై రూ.800.. నెలకు రూ.3.20 లక్షలు

నిబంధనల ప్రకారం వేజ్ సీలింగ్ లిమిట్ రూ.15 వేలుగా ఉంది. ప్రస్తుతం శ్రీరాంపూర్ ఓసీపీలో కాంట్రాక్టర్ సంస్థలో పని చేసే కార్మికులకు రూ.20 వేల వరకు వేతనాలు ఇస్తున్నారు. వేజ్ సీలింగ్ లిమిట్ కంటే ఎక్కువ వేతనాలు ఇచ్చినప్పటికీ నిబంధనల ప్రకారం 12 శాతం ఈపీఎఫ్ జమ చేయడం లేదు. ప్రస్తుతం ఈ సంస్థ ఆధ్వర్యంలో దాదాపు 500 మంది వరకు పని చేస్తున్నట్లు తెలిసింది. కానీ, అధికారిక సమాచారం చూసుకుంటే 496 మంది కార్మికులకు ఈపీఎఫ్ జమ చేస్తున్నట్లు తెలిసింది. సుమారు 400 మంది అనుకుంటే ఈ 400 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేల జీతం ఇచ్చినా, 12 శాతం ఈపీఎఫ్ రూ.1800 కట్టాలి. కానీ, గడిచిన 18 నెలల్లో ఏ ఒక్క నెల కూడా రూ.1800 జమ చేయలేదని ఇక్కడ పనిచేసే కార్మికులే చెప్తున్నారు. ప్రతి నెల రూ.800 నుంచి రూ.1000 మాత్రమే ఈపీఎఫ్ కడుతున్నారని చెప్తున్నారు. ఈ లెక్కన నెలకు ఒక్కో కార్మికుడిపై రూ.800 మిగుల్చుకుంటున్న సంస్థ ప్రతి నెల రూ.3.20 లక్షలు కార్మికులకు న్యాయంగా రావాల్సిన సొమ్మును అప్పనంగా నొక్కేస్తున్నట్లు అవగతం అవుతున్నది. 18 నెలలకు చూసుకుంటే రూ.57.60 లక్షల కార్మికుల సొమ్ము స్వాహా చేసినట్లు స్పష్టం అవుతున్నది.

### కండ్లు మూసుకున్న అధికారులు

కాంట్రాక్టర్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని అనుసరించి కాంట్రాక్ట్ సంస్థ కార్మికులు/ఉద్యోగులకు ఇస్తున్న వేతనాలు, ఈపీఎఫ్ కాంట్రిబ్యూషన్ వివరాలను బిల్స్ తీసుకునేప్పుడు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు సమర్పించి క్లియరెన్స్ తీసుకోవాలి. క్లియరెన్స్ ఇచ్చే ముందు సంబంధిత అధికారులు నిబంధనలను అనుసరించి వేతనాలు ఇచ్చారా? ఈపీఎఫ్ ఇచ్చారా? అని వెరిఫై చేసుకున్నాకే బిల్లులు మంజూరు చేయాలి. కానీ, ఈ కాంట్రాక్టర్ సంస్థ అలాంటివి ఏం చేయడం లేదని తెలిసినప్పటికీ శ్రీరాంపూర్ ఓసీపీ ప్రాజెక్ట్ అధికారి, జీఎం కార్యాలయంలోని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ బిల్లులు ఎలా మంజూరు చేశారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు కావాలనే సదరు కాంట్రాక్టర్ సంస్థకు అనుకూలంగా బిల్లులు ఇచ్చారని ఓసీపీలో పని చేసే కార్మికులు ఆరోపిస్తున్నారు. విషయం బయటికి చెప్తే ఉద్యోగాలు ఉంటాయో ఉండవో అన్న భయంతో ఎవరికీ చెప్పుకోలేకపోతున్నామని వాపోతున్నారు. అంతకుముందు పని చేసిన కాంట్రాక్ట్ సంస్థ నెలకు రూ.1700 నుంచి రూ.1800 ఈపీఎఫ్ ఇచ్చిందని, మరి ఈ సంస్థ అంత ఎందుకు ఇవ్వలేదనేది బిల్లులు విడుదల చేసేముందు అధికారులు ఆలోచించాలి కదా అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. మరి ఇప్పటికైనా సింగరేణి సంస్థ అధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంటారా.. బాధ్యులైన అధికారుల, కాంట్రాక్టర్ సంస్థపై చర్యలు తీసుకుంటారా లేదా అన్నది తేలాల్సి ఉంది.

### మొత్తం బిల్లును రికవరీ చేయాలి..



సింగరేణి సంస్థ ఇచ్చిన వర్క్ ఆర్డర్ నిబంధనలు ఉల్లంఘించిన కాంట్రాక్టర్ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలి. కార్మికులకు న్యాయం రావాల్సిన ఈపీఎఫ్‌లో కోతలు పెట్టి లక్షలు మిగుల్చుకోవడం హేయమైన చర్య. సదరు కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి, చెల్లించిన సొమ్ము మొత్తాన్ని రికవరీ చేయాలి. ఇందుకు పరోక్షంగా సహకరించిన సింగరేణి అధికారులపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.

*- నహీం పాషా, సామాజిక కార్యకర్త.*

### నిజమని తేలితే చర్యలు తీసుకుంటాం..

ఈ విషయం మా దృష్టికి వచ్చింది. సామాజిక కార్యకర్త వేసిన ఆర్‌టీఐలో అన్ని విషయాలపై మా అధికారులు క్లారిటీ ఇచ్చారు. విచారణలో నిజమని తేలితే సదరు కాంట్రాక్టర్ బిల్లుల్లో ఆ మొత్తాన్ని కట్ చేస్తారు. పూర్తి వివరాలపై నాకు స్పష్టత లేదు. ఉన్నతాధికారుల సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. *- శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్, శ్రీరాంపూర్ ఓసీపీ*



చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు లావణ్య. ఈమెది ఆసిఫాబాద్ మండలంలోని బోరుగూడ గ్రామం. జ్వరం రావడంతో సోమవారం ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానకు వచ్చింది. వైద్యుడికి చూపించుకోగా.. మూడు రకాల మందులు రాసిచ్చాడు. ప్రిస్కిప్షన్ తీసుకుని ఫార్మసీ వద్దకు వెళ్తే ఇందులో రెండు రకాల మందులు లేవు. ఒక రకం మాత్రమే ఉన్నాయని ఇచ్చాడు.




మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన ఫార్మసిలో మందులు తీసుకుంటున్న రోగులు

# మందుల్లేవ్..

**ప్రభుత్వ దవాఖానల్లో మందుగోలీల కొరత**

- కనీసం జ్వరం, జలుబుకు కూడా దొరకని దుస్థితి
- ప్రిస్కిప్షన్ తీసుకెళ్తే బయట తీసుకోవాలని సూచిస్తున్న ఫార్మసి సిబ్బంది
- రోగులపై మోయలేని ఆర్థిక భారం



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు చికిత్సకోసం వచ్చిన రోగులు

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/మంచిర్యాల అర్బన్, జూలై 15 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో మందులు దొరకడం లేదు. వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. సాధారణ జ్వరం, జలుబు, దగ్గుతోపాటు మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు వస్తుండడంతో ప్రభుత్వ దవాఖానలను ఆశ్రయిస్తున్నారు. వైద్యులు పరీక్షించి మందులు రాసిస్తుండగా.. ప్రభుత్వ మందుల దుకాణాల్లో దొరుకడం లేదు. చేసేదేమి లేక రోగులు డబ్బులు పెట్టుకుని ప్రైవేటు మందుల దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. అన్ని రోగాలకు ఒకటే మందు అన్నట్లుగా పారాసిటమాల్ వంటి మందులతోనే సరిపెడుతున్నారు. పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచడం లేదు. జిల్లా కేంద్రంలోని మందుల దుకాణంలో మందులు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి పర్యవేక్షులు చెబుతున్నారు. మరి రోగులకు బయట నుంచి మందులు తెచ్చుకోవాలి ఎందుకు సూచిస్తున్నారని ప్రశ్నిస్తే.. మందులు అయిపోయాయని సమాధానం ఇస్తున్నారు. ఈ విషయమై ఆసిఫాబాద్ దవాఖాన సూపరింటెండెంట్ చిన్న కేశవరావును సంప్రదించగా.. జిల్లా కేంద్రంలోని దవాఖానలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపాడు. అలాగే.. మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ హరీశ్‌చంద్రారెడ్డిని అడుగగా.. ఆదిలాబాద్ సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి ప్రతి నెల జీజీహెచ్‌కు మందులు వస్తున్నాయి. ప్రస్తుతానికి డైక్లోఫెనాక్ మాత్రమే కొరత ఉంది. దీనిని బయటి నుంచి కొనుగోలు చేసి రోగులకు అందిస్తున్నాం.



చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు సుష్మిత. ఈమెది మంచిర్యాల జిల్లాలోని జన్నారం. తన పాపకు ముక్కులో పుండ్లు కావడంతో మంచిర్యాలలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు సోమవారం తీసుకొచ్చింది. పరీక్షలు చేసిన వైద్యులు మందులు రాసిచ్చారు. చీటీ తీసుకుని మందుల కౌంటర్ వద్దకు వెళ్తే కొన్ని మాత్రమే ఉన్నాయి. మరికొన్ని లేవని చెప్పారు. లేని మందులను బయటకొంటే దాదాపు రూ.500లకుపైగా అవుతాయన్నారు. ప్రభుత్వ దవాఖాన అన్నట్లే కని మందులు దొరుకకపోతే ఏం లాభం అని ఆవేదన చెందుతున్నది.




వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానకు వచ్చిన విద్యార్థినులు



చిత్రంలో కనిపిస్తున్న బాలిక పేరు వినత్రయ. ఈమెది ఆసిఫాబాద్ మండలంలోని బోరుగూడ గ్రామం. జ్వరం, జలుబు కావడంతో సోమవారం దవాఖానకు వచ్చింది. డాక్టర్ పరీక్షించి మందులు రాసిచ్చాడు. దవాఖాన ఆవరణలో ఉన్న మందుల దుకాణం వద్దకు వెళ్తే ఇందులో రాసిచ్చిన మందులు అందుబాటులో లేవని సిబ్బంది చెప్పారు. వీటిని బయట మందుల దుకాణంలో తీసుకోవాలని సూచించారు.

## మా భూములు లాక్కునేందుకు కుట్ర

**న్యాయం కోసం కలెక్టర్‌ని ఆశ్రయించిన గోలేటి గ్రామ రైతులు**



కలెక్టర్‌ని కలిసేందుకు వచ్చిన బాధితులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 15(నమస్తే తెలంగాణ): తమ భూములను కొంత మంది దళారులతో కలిసి లాక్కునేందుకు సింగరేణి యజమాన్యం కుట్ర చేస్తున్నదని ఆరోపిస్తూ గోలేటి గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గోలేటి ఓపెన్‌కాస్ట్ ఏర్పాటు సమయంలో నిర్వాసితులైన 28 మంది రైతులకు సర్వే నంబర్ 199/1లో 1976లోనే 58.09 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు హక్కు పత్రాలు ఇచ్చారని, వాటిని నమ్ముకొని పట్టాలు చేయించుకోలేదని రైతులు తెలిపారు. ఇటీవల గోలేటి ఓపెన్ కాస్ట్ విస్తరణలో భాగంగా భూ సేకరణ కోసం 2024 జనవరి 1న అభిప్రాయ సేకరణ చేపట్టగా రెవెన్యూ అధికారులు తమను పిలువలేదని తెలిపారు. తమకు తెలియకుండా కొంత మంది రాజకీయ అండదండలు ఉన్నవారు ఇప్పటికే అక్రమంగా పట్టాలు కూడా చేసుకున్నారని ఆరోపించారు. 1976 నుంచి సాగులో ఉన్న రైతుల సమక్షంలో విచారణ చేపట్టాలని, తాము జీవనాధారమైన భూములకు ఇచ్చే రివార్డుపై కూడా అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

### ఇంటి పట్టాల కోసం 24 ఏళ్లుగా...



ఇంటి పట్టాల కోసం 24 ఏళ్లుగా ఎదురుచూస్తున్న బాధితులు

వట్టివాగు ప్రాజెక్టు నిర్మాణంలో తిర్యాణి మండలంలోని దేవాయిగూడా ఇళ్లను కోల్పోయిన వారికి 2000 సంవత్సరంలో నష్టపరిహారంగా ఒక్కొక్కరికీ 4 గంటల ఇంటి స్థలాన్ని ఆసిఫాబాద్ మండలంలోని అప్పపల్లిలో కేటాయిస్తూ పునరావాసాన్ని కల్పించారు. వాటికి ఇప్పటివరకు పట్టాలివ్వలేదని, కోరుతూ సోమవారం నిర్వాసితులు కలెక్టర్‌కు విన్నవించారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



మంచిర్యాలలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

## ప్రజావాణి అర్జీల పరిష్కారానికి కృషి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, జూలై 15 : ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారానికి కృషి చేస్తామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. చెన్నూరు, భీమారం, బెల్లంపల్లి, వేమనపల్లి, నస్పూర్, హాజీపూర్ తదితర ప్రాంతాల ప్రజలు పింఛన్, ఉపాధి, భూ కబ్జాలు, ధరణి సమస్యలు తదితర వాటిపై అర్జీలు అందించారు. 62 అర్జీలు వచ్చాయని, ప్రతి దరఖాస్తునూ క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని తెలిపారు.

### అర్జీలను పరిష్కరించాలి

**- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 15 : వివిధ సమస్యలపై ప్రజావాణికి వచ్చిన అర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, కాగజ్‌నగర్ ఆర్డీవో కాసబోయిన సురేశ్‌తో కలిసి, వివిధ శాఖల అధికారులు అర్జీలను స్వీకరించారు. విద్యాలయాల్లో సీట్ల కోసం, దివ్యాంగ, వృద్ధాప్య, వితంతు పింఛన్లు, భూ కబ్జా, ధరణి సమస్యలు, గ్రామాల్లో సమస్యలు తదితర వాటిపై ప్రజలు అర్జీలు అందించారు. ప్రతి దరఖాస్తునూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

## నామమాత్రంగా తనిఖీలు

చెన్నూర్ రూరల్, జూలై 15: చెన్నూర్‌లో 'డబ్బులు ఇస్తేనే ఎరువులు' శీర్షికన 'నమస్తే'లో వచ్చిన కథనానికి స్పందించిన జిల్లా స్థాయి అధికారులు మండలంలోని పలు గ్రామాల్లోని డీసీఎమ్మెస్, హాకా, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో బెల్లంపల్లి ఏవో ప్రేమ్ కుమార్, దండేపల్లి ఏవో అంజిత్ కుమార్, తాండూర్ ఏవో కిరణ్మయి విచారణ చేపట్టారు. బిల్ బుక్స్, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. ఎరువుల విక్రయంపై డీలర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికను జిల్లా స్థాయి అధికారులకు అందిస్తామని తెలిపారు.

### తూతూ మంత్రంగా విచారణ..

**● 'నమస్తే'కు స్పందన**

మండలంలో డీసీఎమ్మెస్, హాకా, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ అధికారులు తూతూ మంత్రంగా విచారణ చేపట్టారని విమర్శలు వెల్లువెత్తాయి. ఒక రోజు ముందే ఫోన్ చేసి హెచ్చరించడంతో తనిఖీలపై డీలర్లు అప్రమత్తమై అన్ని రసీదులు, రికార్డులు సిద్ధంగా ఉంచినట్లు సమాచారం. గతంలోనూ ఇదే విధంగా తనిఖీలు జరగగా డీలర్లకే అనుకూలంగా నివేదిక వచ్చింది.




నాగాపూర్ డీసీఎమ్మెస్ సెంటర్ నిర్వాహకుడిని విచారిస్తున్న బెల్లంపల్లి ఏవో ప్రేమ్ కుమార్


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679